**9వ పాఠం** **మే 23-29**

# పాపము, శుభవార్త మరియు ధర్మశాస్త్రము

**సబ్బాతు మధ్యాహ్నము :** **మే 23**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : న్యాయాధిపతులు 14, 1 కొరింథి 10:12, రోమా 3:20, మత్తయి 5:17,18, మత్తయి 7:24-29.**

**కంఠతవచనం : "నీ ఉపదేశము వలన నీవు నన్ను బ్రదికించితివి. నేనెన్నడును వాటిని మరువను. నీ ఉపదేశములన్ని నేను వెదకుచున్నాను. నేను నీవాడనే నన్ను రక్షించుము" (కీర్తన 119:93,94) .**

పాపము మనకున్న అతిపెద్ద సమస్య. అన్ని విషయాల కన్నా పాపము అనునది దేవునితో మనకుండవలసిన సన్నిహిత బాంధవ్యము ఏర్పడకుండా అడ్డుగా నిలుచును. ఇప్పుడు దేవుని నుండి పాపము మనలను వేరుచేయుచున్నది. (యెషయా 59:2) అంతిమముగా పాపము మనలను మోసము చేయుచూ గాయపరుస్తూ నాశనము చేయును. మనము ఎదుర్కొనే జీవిత పోరాటములలో పాపమునకు మరియు స్వార్థమునకు వ్యతిరేకముగా చేసే పోరాటమే గొప్పది.

కొందరు పాపమును గురించి అంత ఎక్కువగా ఆందోళన చెందరు. పాపము అనునది వారి జీవితాలలో స్వాభావికమైన భాగమని ఈ ప్రజలు నమ్మేదరు. యదార్థముగా పాపము వారిని ఏ విధముగాను తొందర పెట్టదు. లేక పాపము పూర్వకాలములో చాలా ఇబ్బందులను కలుగజేసినట్లు దాని ప్రభావము నేడు వారి మీద అంత తీవ్రముగా లేనట్లు వారు భావిస్తారు. పాపమును గురించి మాట్లాడుటకు భయము వేస్తుందా? సర్వసాధారణముగా పాపముగా మాట్లాడేటప్పుడు మన మాటలు సంబంధిత మనుష్యులను గాయపరుస్తాయేమో అనే భయము మనలో వుంటుంది. అంతిమముగా పాపముతో జీవించాలని ఎంత ఎక్కువగా ఎన్నిక చేసుకుంటామో, అంత ఎక్కువగా సమస్యలను మనము ఎదుర్కొనవలసి వస్తుంది. అటువంటి పరిస్థితులలో దేవునితో మనకుండవలసిన బంధుత్వము అంత ఆరోగ్యవంతముగా లేక సౌఖ్యముగా వుండదు.

అవును మనమందరము పాపులమే. మనమందరము పాపము చేసితిమి. మన తలంపులు కొన్ని పాపపు పనులు చేయుటకు మనము చూపించే కారణములు, మన ప్రవర్తన, మాటలు ఇతర మనుష్యులను మనలను మరియు దేవునిని గాయపరచును. చివరిగా దేవునితో మనకున్న బాంధవ్యమును పాపము నాశనము చేయును. అయితే దేవుడు మనకు ఆయన ధర్మశాస్త్రమును ఇచ్చి ఆయన ఏమైయున్నాడనే విషయాన్ని మనకు చూపించుచున్నాడు. మన జీవితాలలో వున్న పాపమును దేవుని యొక్క ఆజ్ఞలు మనకు చూపించును.

దేవుడు ధర్మశాస్త్రమును మనకు ఎందుకు అనుగ్రహించెనో కారణమును ఈ వారం పాఠములో చదువుకొనబోవుచున్నాము. మనుష్యులు దేవుని ఆజ్ఞలను మీరినపుడు వారు ఏ విధముగా దేవునితో సంబంధమును స్థిరపరచుకొనగలరు?

మే 30, సబ్బాతు దినమున, ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతు బడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **మే 24**

## మనము పాపము చేయుటకు లొంగిపోయినప్పుడు (న్యాయాధిపతులు 14)

న్యాయాధిపతులు 14 మరియు న్యాయా 16:1,4,16,17లో సంసోను పాపము చేసిన సమయములను గూర్చి చదువుడి. ఒక ప్రత్యేకమైన కారణముతో దేవుడు సంసోనును ఎన్నిక చేసుకొని ఆయనను సేవించమని చెప్పెను. అయితే అతడు దేవుని సేవించుచునే పాపము చేయుటకు సంసోను ఎన్నిక చేసుకొనెను. సంసోను వృత్తాంతము ఎట్లా ముగిసింది. అది మనకు ఏమి బోధిస్తుంది?

దేవునికి మరియు సాతానుకు మధ్య ప్రపంచ వ్యాప్తముగా జరుగుచున్న సంఘర్షణ యదార్థమైనది. ఆ యుద్ధములో మనందరము భాగమైయున్నాము. పరలోకములో ఆరంభమైన ఆ యుద్ధము ఇప్పుడు ప్రతి మానవుని యొక్క జీవితములో కొనసాగుచున్నది.

యేసు త్వరలో వచ్చుచున్నాడు. సాతానుకు ఎక్కువ సమయము లేదని తెలుసు. అందుచేత మనకు దేవునితో ఒక సన్నిహితమైన బాంధవ్యము లేకుండా చేయుటకు సాతానుడు తాను చేయగలిగినదంతయు చేయుటకు ప్రయత్నించుచున్నాడు. బహుశ తప్పు లేక చెడు కానటువంటి ఏమైన కొన్ని విషయాలను అనగా పనిచేయుట, టీవీ చూచుట, ఇంటర్నెట్ ఉపయోగించుట, సరుకులు కొనుటకు దుకాణాల వెంట తిరుగుట, ఆటలు ఆడుట లేక చూచుట, ఆహారము భుజించుట వంటి అనేక కార్యాలను చేస్తూ ఉండవచ్చును. అయితే ఈ పనులన్నింటినీ చేయుటకు చాలా సమయము వెచ్చిస్తాము. అందుచేత దేవునితోను మరియు ఇతరులతో గడుపుటకు మీకు సమయము ఎక్కువ మిగులక పోవచ్చును. మనము బలహీనులమని సాతానుకు తెలుసు. దేవునితో సమయము గడుపుటకు వీలు లేకుండా చేయుటకు మనము ఏ పనులు ఎక్కువగా చేస్తే అది సాధ్యమౌతుందో వానిని చేయుటకు సాతాను మనలను ప్రోత్సహిస్తాడు. ప్రతి దినము మన దినచర్యను ప్రారంభించకముందు దేవునిని వెదకుటకు లేక ఆయనతో సమయము గడుపుటకు గుర్తుపెట్టుకోవాలి. (మత్తయి 6:33)

మనము పాపులమని యేసు అర్థము చేసుకుంటాడు. అయితే ఆయనతో మన బాంధవ్యము విషయములో నిర్లక్ష్యముగా వుండకూడదని యేసు మనలను హెచ్చరించుచున్నాడు. (ప్రకటన 2:1–7, ప్రకటన 3:14–22) అవును యేసు దేవుడై ఉన్నాడు. అయితే ఆయన మానవుడిగా కూడా అవతరించెను. అందువలననే యేసు మనవలెనే అలసిపోయెను. (యోహాను 4:6) మనము పనిచేసినట్లుగానే యేసు కూడా చాలా విస్తారమైన పని కలిగిన జీవితమును జీవించెను. అయితే యేసు తన తండ్రికి ప్రార్థన చేయుటకు కొంత సమయమును కేటాయించెను. (లూకా 5:16, లూకా 6:12, మార్కు 1:35, మత్తయి 14:23) పాపమునకు, సాతానుకును వ్యతిరేకముగా పోరాడుటకు అవసరమైన బలమును పొందుటకు ఆయన తన తండ్రితో సమయమును గడుపుట ఎంతో మేలైన విషయముగా ఎంచెను. మనము కూడా సాతానుకు పాపముకు వ్యతిరేకముగా పోరాడుటకు ప్రార్థన సమయము గడుపుట అన్నిటికన్నా మంచి విషయము.

పాపముకు వ్యతిరేకముగా పోరాడుటకు సంసోను తన స్వశక్తి మీద ఆధారపడుట వలన పాపము చేసెను. ప్రతి దినము పాపమునకు వ్యతిరేకముగా పోరాడుచున్నాము. ఆ ప్రయత్నములో మనలను బలహీనపరచుటకు సాతాను కృషి చేసి దేవునితో మనకున్న బాంధవ్యమును నాశనము చేయును. పాపము చేసినపుడు అపరాధ భావముతో ఉంటాము. దేవునికి సమీపముగా చేరుటకు సందేహిస్తాము. గుర్తుంచుకోండి. సాతానుకు వ్యతిరేకముగా నిలువబడుటకు విశ్వాసము సహాయపడును. బైబిలు చదివినపుడు, విధేయత చూపినపుడు మన విశ్వాసము బలముగా ఎదుగును.

**నీ జీవితములో ఏ పాపాలకు సమస్యలకు వ్యతిరేకముగా నీవు పోరాడుచున్నావు? బైబిలు నీకు ఏ విధముగా సహాయ పడగలదు?**

## సోమవారం మే 25

## హెచ్చరికలు (1 కొరింథి 10:12)

దేవునితో మనకున్న బాంధవ్యమును గాయపరిచే విషయాలకు వ్యతిరేకముగా హెచ్చరికలతో కూడిన అనేక వర్తమానములతో బైబిలు నిండియున్నది. యేసులో మనము ఎదుగుటకు వీలు లేకుండా ఈ గాయపరిచే విషయాలు అడ్డుకుంటాయి. యేసు మరియు పౌలు నుండి ఆ హెచ్చరికలను ఈ క్రింద సూచించడమైనది.

పౌలు: తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను. (1 కొరింథి 10:12) సంసోనును గుర్తు చేసుకోండి. తన స్వశక్తి మీద అతను ఆధారపడెను. సంసోను చేసినట్లు మీరు చేయకుడి. దేవుని యందు నమ్మకముంచుడి.

యేసు: కావున నీకు ధర్మము చేయునపుడు మనుష్యుల వలన ఘనత నొందవలెనని, వేషధారుల సమాజ మందిరములలోను, వీధులలోను చేయులాగున నీ ముందర బూర ఊదింపవద్దు. వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. (మత్తయి 6:2) నీవు చేసే కొన్ని ఆసక్తికరమైన పనులను గూర్చి డంబములు పలుకవద్దు. యేసు యొక్క ఒరవడిని అనుసరింపుము. నీ హృదయములో వున్న గర్వము నంతటిని తొలగించుకో.

యేసు: నేను మీతో చెప్పునదేమనగా ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును. నీకుడి కన్ను నిన్ను అభ్యంతర పరచిన యెడల దానిపెరికి నీయొద్ద నుండి పారవేయుము. నీ దేహమంతయు నరకములో పడవేయబడకుండా నీ అవయవములలో నొకటి నశించుట నీకు ప్రయోజనకరము గదా. (మత్తయి 5:28,29) నీవు ఏమైనను చేసి నీలో వున్న చెడు మరియు దుర్మార్గపు తలంపులను తీసివేసుకో. అది దేవునితో సన్నిహిత సంబంధము ఏర్పడకుండా అడ్డుపడును.

యేసు: మీరు తీర్పు తీర్చకుడి. అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదు. మీరు తీర్చు తీర్పు చొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పు తీర్చబడును. మీరు కొలుచు కొలత చొప్పుననే మీకును కొలువబడును. ( మత్తయి 7:1,2) ఇతరులకు తీర్పు తీర్చకుడి. తీర్పు తీర్చువాడు దేవుడే. నీవు కాదు. (1 కొరింథి 4:5)

యేసు: నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న నా తండ్రికి కుమారులైయుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి. (మత్తయి 5:44) నీ శత్రువులను ద్వేషించుట మానుకో. నిన్ను గాయపరచు వారిని ద్వేషించినపుడు నీ ద్వేషము దేవుని నుండి నిన్ను వేరుచేయును. నీ శత్రువుల కొరకు ప్రార్థించు. ఇతరులతోను, దేవునితోను నీ బాంధవ్యము ప్రార్థన ఎటువంటి మార్పును తెచ్చునో నీవు వేచి చూడవలెను.

యేసు: నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును. తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును. ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును. (మత్తయి 5:22) నీ స్నేహితులు, కుటుంబసభ్యుల మీద అరచునప్పుడు నిన్ను నీవు సమర్థించుకొనవచ్చును. అయితే నీ కుటుంబముతోను, దేవునితోను మరియు స్నేహితులతోను నీకున్న బాంధవ్యము విషయములో నీ కోపము ఏమి చేసినది?

మన చేతులు, కాళ్లు, నేత్రములు మనలను పాపము చేయుటకు ప్రోత్సహించుటను గూర్చి యేసు మార్కు 9:42-48లో మాట్లాడెను. పాపము గూర్చి ఆయన హెచ్చరించినదేమి? ఆ హెచ్చరికకు నీవు విధేయత చూపుచున్నావా?

## మంగళవారం మే 26

## ధర్మశాస్త్రము (రోమా 3:20)

ఒక క్రైస్తవేతరునికి లేక అన్యమతస్థులకు పాపమును మీరు ఏ విధముగా వారికి వివరిస్తారు? పాపము అనగా ఏమిటని బైబిలు చెప్పుచున్నది? రోమా 3:20 మరియు 1 యోహాను 3:4 జవాబు కొరకు చదువుడి.

దేవుని యొక్క ఆజ్ఞలను అతిక్రమించుటే పాపము. (1 యోహాను 3:4) మనము పాపులము (కీర్తన 51:5, యిర్మీయా 17:9) పాపము అంటే ఏమిటో యథార్థముగా ధర్మశాస్త్రము చూపించుచున్నది. మన హృదయములలో యథార్థము ఏమి వున్నదో అర్థము చేసుకొనుటకు పది ఆజ్ఞలు మనకు సహాయపడును. నీ పూర్వపు పాపజీవితముల కంటే, మేలైన జీవితములుగా మెరుగుపరుచుకొనుటకు ధర్మశాస్త్రము మనకు సహాయము చేయును. అదే సమయములో దేవుని ప్రేమను గూర్చి పది ఆజ్ఞలు మనకు తెలియజేయును. దేవునికి ఏది ప్రాముఖ్యమైన విషయమో ధర్మశాస్త్రము మనకు తెలియజేయుచున్నది.

దేవుడు తన చేతి వ్రేలితో పది ఆజ్ఞలను వ్రాసెను. (నిర్గమ 20:3-17) పది యాజ్ఞలు చాలా ప్రాముఖ్యమైనవని యేసు మనకు చెప్పుచున్నాడు.

నీవు నీపూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీపూర్ణ వివేకముతోను, నీపూర్ణ బలముతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునది ప్రధానమైన ఆజ్ఞ. రెండవది, నీవు నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెననునది రెండవ ఆజ్ఞ. వీటికంటే ముఖ్యమైన ఆజ్ఞ మరేదియు లేదని అతనితో చెప్పెను. (మార్కు 12:30,31) యేసు ఇంకా మాట్లాడుతూ.. మోషే ద్వారా దేవుడు అనుగ్రహించిన ఈ పది ఆజ్ఞల నుండే వచ్చినవని చెప్పెను. (మత్తయి 22:40) అనగా ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమైయున్నవని అర్థము.

సీనాయి పర్వతము యొద్ద దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు ఇచ్చిన ఆ ఆజ్ఞలు (దేవుని వాక్యములు) నేడు మనకు ఇవ్వబడినవి. (హెబ్రీ 1:1,2) దేవుని ధర్మశాస్త్రము అంతయు మన బాంధవ్యములకు సంబంధిచినవై యున్నవని దేవుని వాక్యాలు సెలవిచ్చుచున్నవి. దేవునితోను, ఇతరులతోను వుండవలసిన మన బాంధవ్యమును కాపాడుట కొరకు దేవుడు ధర్మశాస్త్రమును అనుగ్రహించెను. అయితే సాతానుడు ఆజ్ఞలను ప్రజలు అపార్థము చేసుకొనే విధముగా వ్యాజ్యము చేయుచున్నాడు. అందుచేత కొందరు పది ఆజ్ఞలు ఆచరించుటకు వీలు కాని ఒక భారముతో కూడిన బరువు మోపువంటిదని భావించుచున్నారు. ధర్మశాస్త్రము ప్రేమ మరియు స్వేచ్ఛకు సంబంధించినవని వారు అర్థము చేసుకొనలేకపోతున్నారు. ఈ విషయములో బైబిలు ఈ విధంగా చెప్పుచున్నది. మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట. ఆయన ఆజ్ఞలు, భారమైనవి కావు. (1 యోహాను 5:3)

1. దేవుని వాక్యమైన బైబిలు ఎంత విలువ గలది? నీ జవాబుకు సరిపడే దాని సంఖ్య చుట్టూ గుండ్రని గీత పెట్టండి. (1) అంత విలువ గలవి కావు. (2) కొంత విలువ గలవైయుండవచ్చు (3) అతి విలువైనవి నా జీవితానికి ముఖ్యమైనవి.

2. ధర్మశాస్త్రము నాలో మంచి ప్రవర్తన కలిగించుటకు నన్ను వాటికి బానిసగా చేయును అని అనుకుంటున్నావా? నన్ను ఒక బలమైన స్వేచ్ఛా జీవిగా చేయునని నేను అనుకుంటున్నానా?

3. దేవుని యెడల ఇతరుల యెడల ప్రేమ కలిగియుండుట నా జీవితములో ముఖ్యభాగమైతే ఏమి సంభవిస్తుంది? నా సంఘము, బాంధవ్యము ఏ విధంగా మార్పు చెంది వృద్ధి చెందును?

**బుధవారం** **మే 27**

## ధర్మశాస్త్రము మరియు శుభవార్త (మత్తయి 5:17, 18)

### మత్తయి 5:17,18లో పది యాజ్ఞల గురించి యేసు ఏమి చెప్పెను?

పది ఆజ్ఞలు ఆయన ప్రేమను గురించి మనకు చెప్పుచున్నవి. ఆయనకు ముఖ్యమైన విషయము ఏమిటో అని ధర్మశాస్త్రము మనకు చూపును. ఆయనతోను, ఇతరులతోను వుండవలసిన బాంధవ్యమును కాపాడుటకు దేవుడు తన ధర్మశాస్త్రమును మనకు అనుగ్రహించెను. అందరము పాపము వలన శ్రమలను అనుభవిస్తున్నాము. అవును కదా? మనము దేవునితో జీవించుచు ఆయనలో ఎదుగు నిమిత్తము దేవుడు మనకు తన ఆజ్ఞలను అనుగ్రహించెను.

ధర్మశాస్త్రమంతయు యేసు యొక్క ప్రేమను గూర్చియే వివరించుచున్నది. యేసు ఈ విధగాము చెప్పెను. మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు. (యోహాను 14:15) మన పూర్ణహృదయముతో యేసును ప్రేమించినపుడు ఆయన ఆజ్ఞలను గైకొనాలని కోరుకుంటాడు. ఆజ్ఞలను అర్థము చేసుకున్నప్పుడు ఇంకా ఎక్కువగా యేసును ప్రేమిస్తాము. ఇక్కడ దేవుని యెడల మన ప్రేమ ఎదగాలనుకుంటే మన కొరకు యేసు సిలువ మీద మరణించాడు అనే విషయాన్ని ధ్యానించినచో అదొక మంచి మార్గమును సరాళము చేస్తుంది. మనము చేయవలసిన పనులలో ఇది ముఖ్య విషయం.

తప్పని సరిగా పది ఆజ్ఞలు శుభవార్తతో బహు సన్నిహితముగా జతచేయబడి వున్నవి. ధర్మశాస్త్రము మనలను రక్షించలేదు అవి ఎల్లప్పుడు గుర్తించుకోవాలి. పది ఆజ్ఞలు మనలను క్షమించలేవు. ధర్మశాస్త్రమును గైకొనుచున్నామని దేవుడు మనలను అంగీకరించడు. రక్షింపబడుటకు యేసు సిలువ మీద ఆయన మరణము మనకు అవసరమైయున్నది. మనకు పాప క్షమాపణ ఎందుకు అవసరమో పది ఆజ్ఞలు చూపిస్తాయి. అదే విధముగా యేసు మనకు ఎందుకు ప్రత్యామ్నాయముగా అవసరమో అర్థము చేసుకొనుటకు యేసును గూర్చిన శుభవార్త సహాయము చేయును. మన పాపముల విషయమై యేసు మరణించెను అనునదే శుభవార్తయై యున్నది. ఆయన విధేయత చూపించుట ద్వారా మనలను ఆయన రక్షించుచున్నాడు. ఆయన విధేయతను ఒక వరముగా అనుగ్రహించెను. యేసు నందు మనకు విశ్వాసమున్నపుడు ఆ వరము మనకు అనుగ్రహింపబడును.

పది ఆజ్ఞలను గైకొనాలని నమ్ముచున్నాము. అయితే అవి మనలను రక్షింపలేవని కూడా నమ్ముచున్నాము. ఈ సందర్భంగా క్రింది వాక్యాలను చదువుడి. రోమా 3:28, రోమా 4:13–16, గలతీ 2:16, గలతీ 3:13 మరియు ఫిలిప్పీ 3:9. ధర్మశాస్త్రమును గూర్చిన బైబిలు సత్యమును బాగుగా అర్థము చేసుకొనుటకు ఈ వాక్యములు ఎట్లా సహాయపడును.

1 .......................................... 2 ..........................................
3 .......................................... 4 ..........................................
5 ..........................................................................................

## గురువారం మే 28

## తెలిసికొనుట మరియు నెరవేర్చుట (మత్తయి 7:24-29)

కొండ మీద ప్రసంగములో ఆయనతోను, ఇతర మనుష్యులతోను మనకుండవలసిన బాంధవ్యములను గూర్చి అనేక విషయాలు యేసు మాట్లాడెను. యేసు ఇచ్చిన వర్తమానము చివరలో ఒక ప్రాముఖ్యమైన విషయమును ఆయన చెప్పెను. ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచువాడు పరలోక రాజ్యములో ప్రవేశింపడు గానీ, పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును (మత్తయి 7:21).

కొందరికి ఆయన గురించి తెలుసు అయితే నిజముగా ఆయన వారికి తెలియదు. అవును ఆయనను తెలుసుకొనుటకు జ్ఞానము అవసరము. దేవుని ప్రజలకు దేవుడు ఎవరో తెలియదు గనుక వారు నాశనము చేయబడుదురని బైబిలు చెప్పుచున్నది. దేవుని గూర్చిన జ్ఞానమును ఆయన ప్రజలు తిరస్కరించినపుడు కూడా వారు నాశనము చేయబడుదురు. (హోషేయ 4:1,6,10) అందుచేత బైబిలు సత్యము చాలా ప్రాముఖ్యమైనది. అయితే బైబిలు సత్యము మనలను మార్చవలసియున్నది. ఇంకా బైబిలు సత్యము మన హృదయములలో దేవునిని మనకు సమీపముగా తీసుకొని రావలసియున్నది. ఈ విషయాలన్నింటిని బైబిలు సత్యము నెరవేర్చలేకపోయినట్లయితే దానిలో వున్న జ్ఞానము నిరుపయోగమవుతుంది.

యేసు ఈలాగు చెప్పెను. అద్వితీయ సత్యదేవుడైన నిన్నును, నీవు పంపిన యేసు క్రీస్తును ఎరుగుటయే నిత్య జీవము. (యోహాను 17:3) మనము పరలోకములో ప్రవేశించగోరిన

యెడల ఏమి చేయాలో యేసు మనకు చెప్పెను. మనమేమి చేయాలని దేవుడు కోరుచున్నాడో వాటన్నిటిని చేయాలి. తప్పనిసరిగా దేవునిని తెలుసుకోవాలి. ఆయనను ఎరగనిచో ఏమి చేయవలసి యున్నామని కోరునో వాటిని చేయలేకపోదుము. మీ పిల్లలు మిమ్మును ప్రేమించుచున్నారని చెప్పిన యెడల వారు ఏమి చేయాలని మీరు కోరుదురో వాటిని తప్పనిసరిగా చేస్తారు. అవును కదా! (కనీసము ఎక్కువ సార్లయినా చేస్తారు కదా!) మిమ్ములను వారు ప్రేమించి గౌరవిస్తున్నారని వారి క్రియలు మీ యెడల వారు చూపించే విధేయత చూపిస్తాయి. అదే విధముగా మనము దేవుని ప్రేమించిన యెడల ఆయన మనమేమి చేయాలని కోరునో దాని ప్రకారము చేస్తాడు. మనము చేయుటకు దానికన్నా మించినది వుంటుందని అనుకొనడు. దేవుని ప్రేమించిన దానిలో నుండి దేవుని యెడల మన విధేయత వచ్చును. దేవునితో మనకు మన విధేయత మరియు మన ప్రేమ ఈ రెండు గుణములు దేవునితో మనకు సౌఖ్యముగా వున్న మరియు ప్రేమతో కూడిన బాంధవ్యము ఉన్నట్లు చూపించును.

**యేసు కొండ మీద చేసిన ప్రసంగమును ఏ విధముగా ముగించెను? జవాబు కొరకు మత్తయి 7:24-29 చదువుడి.**

మేలుకరముగా మన జీవితాలను యేసు యొక్క వర్తమానము మార్చగలదు. అయితే ముందుగా ఆయనకు మన హృదయములను తప్పని సరిగా తెరవాలి. అప్పుడు మాత్రమే మన జీవితాలకు ఆయనకున్న పరిపూర్ణ ప్రణాళికను అర్థము చేసుకొని దానిని అనుసరించి జీవించగలము.

దేవునితో మనకు సన్నిహిత బాంధవ్యము ఏ విధముగా కలిగి యుండగలము అనే దానికి బైబిలులో రహస్యము దాగి యున్నది. ప్రతి వారికి దేవుడు ఆ బాంధవ్యమును ఇచ్చుచున్నాడు. దానిని విశ్వాసముతో అంగీకరించాలి. అప్పుడు మన పాపములకు బదులుగా యేసు యొక్క పరిశుద్ధ జీవితమును దేవుడు మనకు అనుగ్రహించును. యేసు నందు పరిశుద్ధ జీవితమును జీవించుటకు అవసరమైన బలమును దేవుడు మనకు అనుగ్రహిస్తాడు.

## శుక్రవారం మే 29

## అదనపు అధ్యయనము

దేవుని యొక్క ధర్మశాస్త్రమును గూర్చి సాతానుడు దేవునితో యుద్ధము చేసెను. అందుచేత పది ఆజ్ఞలు అనే అంశమును అనేక మంది ప్రజలు అపార్థము చేసుకొనుటలో మనము ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

యేసు ఈ లోకములో జీవించిన దినములలో కొందరు పదియాజ్ఞలను కొట్టివేయుటకు వచ్చెనని భావించారు. అయితే ఆ భావము చాలా తప్పు. అబద్ధముతో కూడుకొనునది. దేవుని యొక్క మనోహరమైన ప్రేమ మరియు ధర్మశాస్త్రం ఈ లోకములోనికి వచ్చెను. (మత్తయి 5:17, 18) యేసు పది ఆజ్ఞలకు చూపించిన విధేయత మనము దేవునిని అర్థము చేసుకొనుటకు సహాయపడుతుంది.

బైబిలును మనుష్యులు గౌరవించినప్పుడు వారు దేవునిని సంతోషపరచగలరు. ఆయన కోరిన విధముగా ప్రతి విషయమును చేయగలరు. ఇశ్రాయేలీయులు రాజైన దావీదు కాలములోను, రాజైన సొలొమోను యొక్క పరిపాలన ఆరంభ కాలములోను బలమైన జనాంగముగా ఉన్నారు. అందుకు కారణము వారు దేవుని యొక్క ధర్మశాస్త్రమును గైకొని దానిని గౌరవించి జీవించారు. ఏలియా మరియు హోషేయ కాలములలో దేవుని యొక్క సజీవ వాక్యమైన బైబిలు నందు ప్రజలకు విశ్వాసము కలదు. అనేక మంది జీవితాలను వారి విశ్వాసమును బట్టి ఎంతో మేలుకరముగా వుండే విధముగా దేవుడు వారిని మార్చివేసెను. అంత విలువైన బైబిలును ఒక వరముగా దేవుడు ఇశ్రాయేలీయులకు అనుగ్రహించెను. మేలుకరముగా వారి జీవితములు వుండాలనే ఉద్దేశముతో యిర్మీయా కూడా దేవుని ప్రజలతో మార్పును తీసుకొనుటకు కృషి చేసెను. ఆ పనిలో భాగముగా దేవుని వాక్యమును అనుసరించి జీవించమని యిర్మీయా ఇశ్రాయేలు ప్రజలను ఆహ్వానించెను. – ఎలెన్ జి వైట్, ప్రవక్తలు మరియు రాజులు పుటలు 465, 466.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. పాపము అనగా ఏమిటని నేటి ప్రజలు ఆలోచించుచున్నారు. ఈ అంశము మీద మీ సమాజములోని ప్రజలలో సాధారణముగా వున్న భావాలు, నమ్మకాలేమిటి?
2. దేవునితోను, ఇతర మనుష్యులతోను ఉన్న బాంధవ్యము పాపము వలన నాశనమగునని నీవు వ్యక్తిగతముగా చూడగలవా? ఆ అనుభవమేమి బోధిస్తుంది.
3. దేవుని ధర్మశాస్త్రమునకు, విధేయత సులభంగా లేక కష్టముగా నీకున్నదా? ఆ విధముగా నీకుండుటకు నీ జీవితములోని ఏ విషయాలు ఆ పరిస్థితులు కల్గిస్తున్నవి?
4. ఎడ్వంటిస్టు సంఘముగా మనము పది ఆజ్ఞలను గౌరవిస్తున్నామని సంఘము సూచించుచున్నది. అందుచేత మన మంచి ప్రవర్తన ద్వారా రక్షించబడుదుము అనే ప్రమాదకరమైన నమ్మకము కలుగకుండా ఎట్లు తప్పించుకొనగలము? దేవుడు మన న్యాయాధిపతిగా వున్నప్పుడు ఆయన సన్నిధిలో నిలువబడినపుడు రక్షింపబడుటకు దేని మీద ఆధారపడుదుము? నీవు దేవుని ఆజ్ఞలకు విధేయత చూపుట ద్వారానా లేక యేసు యొక్క పరిపూర్ణమైన విధేయతతో కూడిన జీవితంపై ఆధారపడుదువా?
5. దేవునితో ఒకనికున్న బాంధవ్యము అతని జ్ఞానము ఏ విధముగా మార్చివేయగలదు? జవాబు కొరకు ప్రకటన 24:3,13,14 చదువుడి.

❋✶❋